
# కొంతమంది యువకులు



ఊరిబయట రోడ్డు ప్రక్క చిన్న వంతెన మీద ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటున్నారు మిత్రత్రయం మోహన్‌రావు, గోపాలం, రాజబాబు!

మోహనరావు విలాసంగా పొడుగాటి సిగరెట్ కాలుస్తూ పొగను గాల్లోకి వలయంగా వదులుతున్నాడు...

గోపాలం ఆ రోజే విడుదలయిన సినిమా పత్రికలో తల దూర్చి, మధ్య పేజీలో అభిమాన హీరో నిలువెత్తు బొమ్మని దీక్షగా చూస్తున్నాడు.

ఆ హీరోగారు అందాల హీరోయిన్‌ని విల్లులావంచి తన కౌగిట్లోకి లాక్కుంటున్న భంగిమని అతను వివశత్వంతో గొప్పగా మిత్రులకి

వర్ణించి చెబుతున్నాడు...

రాజబాబు ఒక రాళ్ల గుట్టలోని చిన్న చిన్న రాళ్ళను చేతిలోకి తీసుకుని వంతెన క్రింద కాలువలోకి విసురుతూ, మిత్రుడి మాటల్ని హుషారుగా వింటున్నాడు. మధ్యలో ఆ హీరో గురించి తన అభిప్రాయాన్ని వ్యంగ్యంగా వాఖ్యానిస్తున్నాడు.

అభిమాన హీరో గత చిత్రం బాక్సాఫీసును ఎలా బ్రద్ధలు కొట్టిందో, ఎన్ని కేంద్రాల్లో రజతోత్సవం జరుపుకుందో, ఎంత మొత్తం వసూలు చేసిందో, రాబోయే చిత్రం సినిమా చరిత్రలో ఎంత సంచలనం సృష్టిస్తుందో, అభిమాన హీరో అన్ని చిత్రాలకి ఆ ఒక్క హీరోయిన్ పక్కనే ఎందుకు నటిస్తున్నాడో, అందులో ఉన్న రహస్యం ఏమిటో, అంతకు ముందు ఆ హీరోయిన్ ఒక గడ్డం దర్శకుడ్ని అడ్డం పెట్టుకుని ఎలా పైకి వచ్చిందో, చాలా రంజుగా, రసవత్తరంగా చర్చ సాగుతోంది !

మిత్రుల ముఖాల్లో ఏదో ఉత్సాహం, ఉద్వేగం, ఆనందం, మైకం... మైమరుపు... ! సినిమాల గురించి మాట్లాడుకుంటూంటే తమ ఒళ్లు తాము మరిచిపోతారు వాళ్ళు !

మోహనరావు ఏదో బి.ఏ. అయిందనిపించి రెండేళ్ళుగా ఖాళీగా ఉన్నాడు. గోపాలాని కింకా బి.కామ్. లో మూడు సబ్జక్టులు ఉండిపోయాయి. రాజబాబు ఇంటర్ తప్పి చదువు మీద ఎప్పుడో విరక్తి పెంచుకున్నాడు. ముగ్గురూ మధ్య తరగతి యువతరానికి ప్రతినిధులే, కలిసి తిరగడం, కబుర్లు చెప్పుకోవడం, సినిమాలు చూడడం, సిగరెట్లు కాల్చడం, సరదాగా షికార్లు కొట్టడం, ఏ అర్ధరాత్రికో ఇంటికి చేరడం, వాళ్ళ అలవాట్లలో కొన్ని మచ్చు తునకలుగా మనం చెప్పుకోవచ్చు.

సినిమా చర్చ సాగుతూనే ఉంది... పడమటి సంధ్య మరింత సింధూరాన్ని పులుముకుంటోంది!

ఉన్నట్టుండి మోహనరావు కెవ్వుమని అరిచాడు. ఆ అరుపు అతనికి భయం వల్ల వచ్చింది కాదు, బాధ వల్ల వచ్చింది కాదు, హఠాత్తుగా మిత్రుడికి ఏమైందనుకుంటూ గోపాలం, రాజబాబు ఆత్రంగా మోహనరావు ముఖంలోకి చూశారు. అతని కళ్లూ, అవి చూస్తోన్న దిశ వైపుగా తమ దృష్టిని సారించారు.

ఈసారి వాళ్లు కూడా మోహనరావులా కెవ్వుమన్నారు. కెవ్వుమనడంతోబాటు కావు కావుమంటూ కాకుల్లా అరిచారు.

అల్లంత దూరంలో ఒక అమ్మాయి తలవంచుకుని నెమ్మదిగా నడిచివస్తోంది. ఆ అమ్మాయి సన్నగా ఉంది. పొడుగ్గా, సన్నజాజి తీగెలా ఉంది. ఆకుపచ్చని చీర కట్టుకుంది. అదే రంగు రవికె వేసుకుంది. ఒక చేతిలో తెల్లటి కాగితాలు రూళ్ల కర్రలా ఉండ చుట్టి ఉన్నాయి.

"ఒరేయ్ ! అమ్మడు వస్తోందిరా ! ఈ రోజు అటో ఇటో తేలిపోవాలి !" మోహనరావు వంతెనపై నుంచి ఒక్క గెంతు గెంతి క్రిందికి దూకాడు.

"ఏం చేస్తావురా, బాసూ ? నీ వల్ల ఏమీ కాదు... నేనయితేనా..." రాజబాబు రెచ్చకొడుతున్నట్టుగా అన్నాడు.

'మీ ఇద్దరివల్లా ఏమీ కాదురా ! చూడండి నా తడాఖా ! ఆ అమ్మాయిని అమాంతం హత్తుకుని...' గోపాలం గొప్పగా, తను చేయబోయే సాహస కృత్యం వివరించాడు.

ముగ్గురు మిత్రులూ పోటీపడుతున్నారు. వాదులాడుకుంటున్నారు. తమ ప్రతాపాన్ని సాహసాన్ని, హీరోయిజాన్ని ప్రదర్శించడంలో ఎవరికి వాళ్లే ఎగిరి గెంతులు వేస్తున్నారు.

అల్లంత దూరంలో... అడుగులో అడుగు వేస్తూ తలవంచుకుని నడిచివస్తోన్న అరుణ తలెత్తి

చూసింది. వంతెన దగ్గర మిత్రత్రయాన్ని చూడగానే ఆమె గుండె దడదడా కొట్టుకుంది. అడుగులు తడబడ్డాయి. తెలియని భయం నిలువెల్లా అలుముకుంది.

నెల రోజులుగా తన వైపు నేర్చుకోవడాని కంటూ ఇంటి నుంచి బయటకు వస్తోంది. దాదాపు ప్రతిరోజు వీళ్ల వంతెన మీద కూర్చుని వెకిలి చేష్టలతో, మాటలతో తనని హింసిస్తున్నారు. కొంత దూరం వెంటబడుతున్నారు. జంతువుల్లా కూతలు కూస్తున్నారు. అసహ్యంగా, అసభ్య పదజాలంతో అంగాంగ వర్ణనలు చేస్తున్నారు. తను వచ్చే సమయానికి రోడ్డు మీద ఎవరైనా మనుషులు నడుస్తూంటే వాళ్లు బుద్ధిమంతుల్లా వంతెన మీద కూర్చుండిపోతారు. తనిప్పుడు ఒంటరిగా ఉంది. వీళ్లేం చేస్తారో ?

అరుణ భయం భయంగా అడుగులు వేస్తోంది. తనకు తాను ధైర్యం కూడదీసుకుంటోంది.

మోహనరావు, రాజబాబు, గోపాలం రోడ్డుకు అడ్డంగా నిలబడ్డారు.

అరుణ గాంభీర్యం సడలకుండా, రోడ్డు వారగా నడుస్తూ వాళ్లను తప్పించుకుని ముందుకు వెళ్లబోయింది.

"ఆగు, బేబీ ఆగు ! అందమైన నీ ముఖాన్ని ఒక్కసారి దగ్గరకు తీసుకుని ఆశ తీరా ముద్దు పెంటుకుంటానని మా వాళ్లతో పందెం వేశాను. నా ముద్దు తీర్చవా ?" మోహనరావు నోట్లోని సిగరెట్ నేల మీదకు విసిరి, ఆమె ముందు మోకరిల్లినట్టుగా నిలబడ్డాడు.

"సుందరీ ! నీ నడుము చుట్టూ చేతులు వేసి నాట్యం చేస్తాని నేనూ పందెం వేశాను... నన్నూ గెలిపించవా మరి...?" రాజబాబు రెండు రెండు చేతులూ బార్లా చాచి ఆమెను చుట్టుకోబోయాడు.

"బుజ్జిపాపా ! నీ పేరేమిటోతెలియదుగాని... నిన్ను హత్తుకుని, భుజం మీదకు ఎత్తుకుని, మా బాస్ 'సూపర్ స్టార్'లా గిరగిరా తిప్పుతానని మా వాళ్లతో గొప్పలు చెప్పాను... నా మాట నిలబెడతావు కదూ ?" గోపాలం వెకిలిగా నవ్వుతూ, అరుణ కదలకుండా చేయి అడ్డం పెట్టాడు..

ఆమె చుట్టూ వలపన్నినట్టుగా ముగ్గురూ నిలబడ్డారు. చుట్టూ తిరుగుతున్నారు. చప్పట్లు కొడుతున్నారు. ఈలలు వేస్తున్నారు. పాటలు పాడుతున్నారు. పిచ్చిగా నవ్వుతూ కేరింతలు కొడుతున్నారు.

"ఛీ !... ఛీ !... మీరు మనుషులా ! పశువులా! మీకు బుద్ధి లేదూ ? జ్ఞానం లేదూ ? చదువూ, సంస్కారం లేవూ ? ఆడపిల్ల నిలా ఒంటరిగా రోడ్డు మీద ఏడిపించడానికి మీకు సిగ్గులేదూ ? మీ రక్తంలో చీమూ, నెత్తురూ లేవూ ? మీకు అక్కా చెల్లెళ్లు లేరూ ? మీ మగతనం, తెలివి తేటలూ అన్నీ ఒక ఆడపిల్లను ఏడిపించడానికేనా ? వేరే పని లేదా మీకు ? ఇప్పటి వరకూ మీ గురించి ఎవ్వరికీ చెప్పలేదు. ఇప్పుడే వెళ్ళి పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేస్తాను. ఊళ్ళో పెద్దలందరికీ మీ ప్రవర్తన తెలియజేస్తాను. మీ ఆట కట్టిస్తాను... జాగ్రత్త ?" అని అరుణ ఎంత మాత్రం హెచ్చరించలేదు.

"ఆగండి !" అతి నెమ్మదిగా ఆమె గొంతు విప్పింది. మిత్రత్రయం విచిత్రంగా చేష్టలుడిగి నిశ్చేతనంగా నిలబడిపోయారు.

"మీలో మీరు నా గురించి పందెం వేసుకున్నారు కదూ ? సరే ! నేను ఒప్పుకుంటున్నాను. నేనూ మీతో ఒక పందెం వేస్తాను... ఆ పందెంలో మీరు గెలవగలరా ?"

మిత్రత్రయం ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఒక అడుగు వెనక్కి వేశారు.

"మీ ముగ్గురిలో ఏ ఒక్కరైనా నన్ను కట్నం లేకుండా పెళ్లి చేసుకోగలరా ? ఆ ధైర్యం మీకు ఉందా ?"

మిత్రుల ముఖాల్లో నెత్తురు ఇంకిపోయింది.

"అవతారం మాస్టారి అమ్మాయిని నేను. నా పేరు అరుణ. ఇందిరా కాలనీలో ఎనిమిదో నంబరు ఇల్లు మాది. మీకా ధైర్యం ఉంటే నా యీ పందెంలో నెగ్గగలమన్న నమ్మకం ఉంటే వచ్చి నాన్నగారితో మాట్లాడండి !"

అరుణ కంఠంలో కోపం ఉంది. కరకుదనం ఉంది. కారుణ్యం ఉంది. నిస్సహాయత ఉంది. నిర్వేదం ఉంది. అరుణ ఎన్నో భావాల్ని అణచి పెట్టికుంటున్నట్లుగా పెదాల్ని బిగబట్టి నిర్లిప్తంగా ముందుకు నడిచి వెళ్లిపోయింది.

మిత్రత్రయం మస్తిష్కాలు మొద్దుబారి నట్టయ్యాయి.

ఏమిటిది ? ఏం జరిగింది ? ఒక ఆడపిల్ల తమ మగతనాన్ని సవాలు చేసింది. ఏ ఒక్కరైనా తనని కట్నం లేకుండా పెళ్లి చేసుకోగలరా అని పందెం వేసింది. ఆ అమ్మాయిది పొగరా ? తెగువా? పౌరుషమా ? మిత్రుల కిది ఒదో నాటకమా ? ఊహించని పరిణామం. ఎదురు చూడని దాడి, ఏమిటి చెయ్యడం ?

వాళ్ళు ముగ్గురూ తిరిగి వంతెన మీద కూర్చున్నారు. సిగరెట్లు వెలిగించారు. గుండెలనిండా పొగ పీల్చారు. మోహనరావుకు ఉద్రేకం ముంచు కొచ్చింది. రాజబాబుకు ఉక్రోషం తన్నుకు వచ్చింది. గోపాలానికి ఆవేశం పొంగుకొచ్చింది.

ఆ సాయం సంధ్యలో చరచరా నడిచి వెళుతోన్న అరుణని ఏదో చేయాలన్న నిర్ణయం అప్పుడే వాళ్లను ఆవహించింది !

... ... ...

ఉదయం పదిన్నర... మేనెల ! ఎండ బాగా అప్పటికే ఎర్రబడింది... గాలి భారంగా వేడి నిట్టూర్పు లు విడుస్తోంది. నింగిలో సూర్యుడు నిప్పులు కురిసే ప్రయత్నానికి ఆయత్తమవుతున్నాడు.

అవతారం మాస్టారు అప్పుడే వరండాలోకి వచ్చారు. కిటికీలకున్న వట్టి వేళ్ళ చారల మీద నాలుగు చెంబుల నీళ్ళు చల్లారు... తడి గుడ్డ ఒకటి భుజం మీద వేసుకున్నారు. ఉస్సు ఉస్సురనుకుంటూ వాలు కుర్చీలో వెనక్కి వాలారు. ఆయనకు ఆకలిగా ఉంది. వంట ఇంకా పూర్తి కాలేదు... వంట గదిలోంచి పోపు వాసన ఆయన జఠరాగ్నిని మరింత జ్వలింప చేస్తోంది...

"ఏమోయ్ వంటయిందా...?" అసహనంగా, ఆఖరుసారిగా వంట గదివైపుచూస్తూ ఆయన కేక పెట్టారు. అవతల నుంచి జవాబు లేదు.

"అవతారం మాస్టారు మీరేనా...?"

మాస్టారు తుళ్ళిపడినట్లుగా తలపైకెత్తారు. కళ్ళజోడులోంచి ముందుకు ఎగాదిగా చూశారు. ఎదురుగా ముగ్గురు యువకులు ఒకరి ప్రక్క ఒకరు నిలబడ్డారు. ఆ నిలబడ్డ తీరులోనే ఏదో నిర్లక్ష్యం ఉంది. ముగ్గురిలో ఇద్దరు కుర్రాళ్లు వెదురుబద్దల్లా ఉన్నారు. ఒంట్లో కండపుష్టి ఏ మాత్రం లేదు. కళ్లల్లో, ముఖాల్లో ఆ వయసుకు ఉండాల్సిన మెరుపు లేదు. దవడలు లోతుకుపోయి యౌవన దౌర్భాగ్యుల్లా కనిపిస్తున్నారు. ఎవరో, ఏమిటో... ఎక్కడా చూసిన గుర్తు లేదు !

"ఎవరు బాబూ మీరు ? అవతారం మాస్టార్ని నేనే..." మాస్టారి గొంతు మార్దవంగా పలికింది.

"నా పేరు మోహనరావు... వీళ్లు నా స్నేహితులు రాజబాబు, గోపాలం !"

మోహనరావు తన మిత్రుల్ని పరిచయం చేశాడు.

'అలాగా బాబూ... ఎందుకొచ్చారు మీరు...? నాతో మీకేం పని...? అలా చాప మీద కూర్చోండి!'

మిత్రత్రయం చాప మీద కూర్చోలేదు. వాళ్లు అసహనంగా కదిలారు. గుండెల మీద గుండీలు లేని చొక్కాల్ని, ఆ చొక్కాలకున్న కాలర్లనీ పైకి లాక్కున్నారు.

"మీ అమ్మాయి అరుణని, మాలో ఒకరం కట్నం లేకుండా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించు కున్నాం. ఆ విషయం మీతో మాట్లాడాలనీ" ముగ్గురు ముక్త కంఠంతో వచ్చిన పని వెల్లడించారు...

మాస్టారు ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేవలేదు. గొంతు విప్పలేదు. ఆశ్చర్యం, ఆనందం లాంటి భావాలే మీ ఆయన ముఖంలో ప్రత్యక్షం కాలేదు.

"ఏం బాబూ ! ఆట పట్టించడానికీ, హాస్యాలాడడానికీ, నేను తప్ప మరొకళ్ళు ఎవరూ ఈ కాలనీలో మీకు కనిపించలేదా ?" మాస్టారి స్వరం కోపంతో తీవ్రంగా ప్రకంపించింది...

"లేదు సార్ ! మిమ్మల్ని ఆటపట్టించడానికి రాలేదు... నిజానికి మీ అమ్మాయిని ఆటపట్టించాం. అసభ్యంగా మాట్లాడాం. అసహ్యంగా ప్రవర్తించాం. మా ప్రవర్తనకి మేము చాలా సిగ్గుపడుతున్నాం !" మోహనరావు తలవంచుకుని తడపడకుండా చెప్పాడు.

"అరుణ మమ్మల్నీ మా మగతనాన్నీ సవాలు చేసింది... మాతో పందెం వేసింది... ఆ పందెంలో మేము నెగ్గాలనుకుంటున్నాం మాస్టారూ !" రాజబాబు కంఠంలో నిజాయితీ ధ్వనించింది.

"అవును సార్ ! మీ అమ్మాయి తెగువ, అభిమానం మా తప్పుని ఎత్తి చూపించాయి. మేము రాత్రంతా ఆలోచించి పశ్చాత్తాపంతో ఈ నిర్ణయానికొచ్చాం !" గోపాలం గొంతులో గాంభీర్యం చోటు చేసుకుంది.

అవతారం మాస్టారు ఆశ్చర్యంగా ముగ్గురు కుర్రాళ్ళని కళ్ళ కప్పగించి చూస్తున్నారు. వాళ్ల మాటల్ని కర్ణపేయంగా వింటున్నారు. ఆయన పెదాలపై ఓ చిరుదరహాసం కదిలి కనుమరుగ యింది.

"అరుణా ! అరుణా !" ఆయన లోపలికి చూస్తూ కూతుర్ని పిలిచారు.

అరుణ నెమ్మదిగా వచ్చి గుమ్మం దగ్గర నిలబడింది.

'ఏమ్మా ! నువ్వు ఈ కుర్రాళ్ళని కట్నం లేకుండా పెళ్ళి చేసుకోగలరా అని సవాలు చేశావా?' మాస్టారు కుర్చీలోంచి లేచి అరుణని సూటిగా అడిగారు.

అరుణ తల ఒంచుకుంది. అవునన్నట్టుగా తల ఊపింది.

"భేష్ ! బాగుందయ్యా ! ఒక ఆడ పిల్ల ముగ్గురు యువకుల్ని కట్నం లేకుండా పెళ్లి చేసుకోగలరా అని నిలదీసి అడగడం... వాళ్ల పౌరుషంతో ముందుకు రావడం నాకు మహదానం దంగా ఉంది. ఈ తరంలో మీ యువతరంలో రావలసిన అతి ముఖ్యమైన మార్పే ఇది...!"

యువకుల ముఖాలు గర్వంగా, కాంతి వంతంగా వెలిగాయి.

'కానీ బాబూ ! మీరేం ఉద్యోగాలు చేస్తున్నారు? పోనీ రోజుకు ఎంత సంపాదించగలుగుతున్నారు?' మాస్టారు మందహాసంతో ప్రశ్నించారు.

గర్వంగా వెలిగిన యువకుల ముఖాల్లోని కాంతి గుప్పున ఆరిపోయింది.

సమాధానం ఏం చెప్పాలో తెలియక, మోహనరావు జేబులోని సిగరెట్ పెట్టె మీద చేయి వేశాడు. రాజబాబు జేబు రుమాలుతో ముఖం

తుడుచుకున్నాడు. గోపాలం నోట్లో చిటికెన వ్రేలు పెట్టుకుని కొరకసాగాడు.

"మీ చదువులు పూర్తి కాలేదు. ఆర్థికంగా పైసా సంపాదన లేదు. కష్టపడి పనిచేసి మన కాళ్ల మీద మనం నిలబడదాం అన్న ఆసక్తి కూడా లేదు. మరి కట్నం లేకుండా ఆడపిల్లని పెళ్లి చేసుకుని ఎలా పోషిస్తారయ్యా?" అవతారం మాస్టారు వరండా ఆ చివర నుంచి ఈ చివరకు అడుగులు వేస్తూ మాట్లాడుతున్నారు.

మిత్రత్రయం గొంతు పెగలడంలేదు.

"మీరు ముగ్గురూ తల్లిదండ్రులమీద ఆధారపడ్డవాళ్లే. బాధ్యతలంటే అర్థం మీకు తెలియదు... బలాదూరుగా తిరగడమే మీకు తెలుసు... ఇక మీకున్న అర్హత..."

మోహనరావు చివ్వున తలెత్తాడు... అతని ఆత్మాభిమానం దెబ్బతిన్నది..

"మమ్మల్ని తక్కువగా అంచనా వేయకండి, మాస్టారూ ! మార్కెట్లో మా రేటు మీకు తెలియదనుకుంటాను..."

"ఎందుకు తెలియదు బాబూ ? కట్నాల బజారులో మీ రేటు అంచనా వేయగలను. అదీ గాక, కాకుల్లా అరిచి, పొడిచి కాట్ల కుక్కల్లా కరిచి కనిపించిన అమ్మాయినల్లా కళ్ళనీళ్ళ పర్యంతం ఏడిపించే మీరు... మనుసులు మార్చుకుని కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటానని రావడం హర్షదాయకమే, అభినందనీయమే ! కానీ ఆశయం ఒక్కటే కాదయ్యా ! దాన్ని ఆచరించడానికి పునాది కావాలి... సాధించడానికి బలం కావాలి..."

"ఎందుకు మాస్టారూ నస...?" మీ కిష్టమో, కాదో తేల్చి చెప్పెయ్యండి... వెళ్లిపోతాం !" గోపాలం తన విసుగును వెళ్ళగ్రక్కాడు.

"మాలో పౌరుషం ఉంది. అభిమానం ఉంది... మీ అమ్మాయి మాతో పందెం వేసింది. ఆ పందెం వదులుకోమనండి ! లేదా మాలో ఒకర్ని పెళ్ళి చేసుకోమనండి !" గోపాలం ఆగ్రహంతో వెనక్కి తిరిగాడు.

"అరుణ మిమ్మల్ని పెళ్ళి చేసుకోదు, బాబూ!'

మిత్రత్రయం పొగలు గ్రక్కుతూ చూశారు. పౌరుషంతో వాళ్ల నాసికా పుటాలు అదురుతున్నాయి.

"ఎందుకంటే... దానికి పెళ్లయింది బాబూ ! సంవత్సరం తిరగకుండానే దాని మొగుడు మెళ్ళో తాళి తెంపేసి ఆ తాళిని కూడా అమ్మేసుకున్నాడు. అతగాడికి పాతిక వేలు కట్నం ఇచ్చినా సరిపోలేదు. మరో పదివేలు తెమ్మని కొట్టి , తిట్టి నానా చిత్రహింసలు పెట్టాడు. వీధిలోకి గెంటేశాడు. నేను ఒకటి రెండు సార్లు వెళ్లి నచ్చచెప్పినా ఫలితం కనిపించలేదు. మరో పది రోజుల్లో ఆ పదివేలూ తీసుకురాకపోతే కిరసనాయిలుతో అంటించి బూడిద చేసేస్తానన్నాడట. నా అల్లుడు మీలాంటి యువకుడే బాబూ... నా కూతురు భయపడి పారిపోయి వచ్చింది. అందరిలా సంఘానికి భయపడి నా కూతుర్ని నేను వెనక్కి పంపించలేదు. ఆర్థికంగా తన కాళ్ల మీద తను నిలబడే ప్రయత్నంలో టైపూ, షార్ట్‌హేండూ నేర్చుకోమన్నాను. అలా తను టైపుకు వెళ్ళివస్తోంటే మీరు చేస్తోన్న అల్లరి అంతా అరుణ నాకు చెప్పింది... ఏమిటి చెయ్యడం ? మీ వాళ్లకు చెప్పి, పోలీసులకి ఫిర్యాదు చేసి మరింత అల్లరిపడడమా ? నాకా ఓపిక లేదు. మీ తప్పేమిటో మీకు తెలియాలి. మిమ్మల్ని మీరు తెలుసుకునేలా చేయాలి. పిచ్చి పిచ్చి భ్రమల్లో కొట్టుకుపోతూన్న మీరు సమాజంలోని నిజాలు, వాస్తవాలు గ్రహించాలి. అందుకు నేను, అరుణని, మిమ్మల్నో ప్రశ్న వేయమన్నాను. ఆ ప్రశ్నేమిటో, మీకు తెలుసు.

దానికి మీరు స్పందించారు. స్పందించే గుణం మీలో ఉంది. అది ఉంది కాబట్టే మీరు నా ఇంటికి వచ్చారు. సాహసం చేసే లక్షణం మీలో సహజంగానే ఉంటుంది... మీ చదువుని, సంస్కారాన్ని సాహసాన్ని వక్ర మార్గాల్లో ఉపయోగించకుండా మంచి పనుల వైపు మళ్ళిస్తే ఈ సమాజానికి మేలు జరుగుతుంది. ముఖ్యంగా అన్యాయమయిపోతున్న ఆడ పిల్లలకు న్యాయం చేకూరుతుంది. తరువాత మీ ఇష్టం వెళ్ళిరండి బాబూ !"

మాస్టారి వాక్ప్రవాహం ఆవేశంగా... ఆవేదనగా... అలా... అలలు, అలలుగా సాగింది. ఆయన అలిసి పోయినట్టుగా గోడకు చేరగిలబడిపోయారు!

పొగలు గ్రక్కుతున్న మిత్రత్రయం ముఖాలు పొగచూరి పోయాయి. నిప్పుల మీద నీళ్లు చల్లినట్లుగా వాళ్ల మనసులు నీరు కారిపోయాయి.

వాళ్లు ముగ్గురూ అరుణ వైపు జాలిగా చూశారు. ఆ చూపుల్లో ఆర్ద్రత పెల్లుబికింది. వాళ్ల అంతరంగాల్లో చిన్న కదలిక... ఒక ఆలోచన... అలజడి... మరేదో చైతన్యం...

"మా తప్పేమిటో మాకు తెలిసింది, మాస్టారూ! మమ్మల్ని క్షమించండి... ముందు మేము ఏదో ఒక పని చూసుకుంటాం... ఆర్థికంగా మా కాళ్ళ మీద మేము నిలబడతాం. ఆ తరవాత...

"వెళ్ళండి బాబూ ! మీరా పని చేయాలని మా తరం ఆశగా ఎదురు చూస్తోంది. మీరాపని చేస్తే మీ కర్తవ్యం ఏమిటో మీకే బోధపడుతుంది. మీ కర్తవ్యం మీరు దీక్షగా నిర్వర్తించిననాడు. 'కొంత మంది యువకులు, ముందు యుగం దూతలు పావన, నవ జీవన బృందావన నిర్మాతలు...'' అన్న మహాకవి పలుకులు అసత్యాలు కావనీ రుజువవుతాయి...''

మాస్టారికి - మోహన్‌రావు, రాజబాబు, గోపాలం రెండు చేతులూ జోడించారు. హృదయాల నిండా ఏదో ఉత్తేజాన్ని నింపుకుని ఉత్సాహంగా బయటికి నడిచారు. వాళ్లు ముగ్గురూ ఒకరి భుజాల మీద ఒకరు చేతులు వేసుకుని ముందుకు అడుగులు వేస్తున్నారు. వాళ్ల నడకలో ఒక మార్పు ఉంది. వాళ్ల నడవడికకు ఒక తీర్పు దొరికింది. వాళ్ల బ్రతుక్కి ఒక లక్ష్యం. వాళ్ల భవిష్యత్తుకో గమ్యం కనపబడుతున్నాయి.

అవతారం మాస్టారు అరుణతో వరండా దాటి వచ్చి వీధిలో నిలబడ్డారు. ముందుకు సాగిపోతున్న ఆ ముగ్గురు యువకుల్ని చూస్తుంటే ఆయనకు ముచ్చటగా ఉంది. సంతృప్తిగా ఉంది. చాలా సంతోషంగా ఉంది. వీధిలో వేడి గాడ్పులు వీస్తున్నా ఆయన మనసూ, శరీరం శీతల జలపాతంలో సేదదీర్చుకుంటున్నంత చల్లగా, హాయిగా ఉన్నాయి !.

అరుణ మాత్రం తండ్రి వైపు గుర్రుగా చూసింది. గుంభనంగా బుగ్గలు సొట్టలు పడేలా, నవ్వింది. అవతారం మాస్టారు కూతురు తల మీద చేయి వేశారు.

"అమ్మా ! నీకు పెళ్లయిందని నేను అబద్ధం చెప్పినా, నువ్వు కట్నం లేకుండా పెళ్ళి చేసుకోగలరా అని వాళ్లని నిలదీసి సవాలు చేసినా... ఆ కుర్రాళ్ళని మంచి మార్గం వైపు మళ్ళించడమే ధ్యేయం. వాళ్ల బుద్ధికి పదును పెట్టడమే ఉద్దేశ్యం... వాళ్లు ఈ రోజు కాకపోతే రేపైనా నిజం తెలుసుకుంటారని నా విశ్వాసం... మళ్లీ మన గుమ్మం తొక్కుతారని నా ప్రగాఢ నమ్మకం... పదమ్మా !"

అవతారం మాస్టారు అరుణతో కలిసి ఆకలిగా వంట గది వైపు నడిచారు...!

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
25-12-1992